శుక్రవారం 17-5-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 337, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచేయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com

## మహారాష్ట్రలో బయటపడ్డ నోట్ల కట్టల గుట్టలు

**మూడు రోజుల సోదాల్లో రూ.170 కోట్లు స్వాధీనం**



**ముందడుగు మహారాష్ట్ర:**

దేశంలో సార్వత్రిక ఎన్నికల వేళ మహారాష్ట్రలో నోట్ల కట్టల గుట్టలు వెలుగుచూశాయి. మూడు రోజుల పాటు జరిపిన సోదాల్లో రూ.170 కోట్ల విలువైన సొత్తును ఆదాయపన్ను విభాగం స్వాధీనం మిగతా 2లో


## కేజ్రీవాల్ మాటలు ఆయన ఊహ

- ఎప్పుడు లొంగిపోవాలో మా ఆదేశాల్లో ఉంది
- ఈడీ అభ్యంతరంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

**ముందడుగు ఢిల్లీ:**

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు బెయిల్ ఇవ్వడంలో ఎలాంటి మినహాయింపు లేదని సుప్రీంకోర్టు గురువారం వ్యాఖ్యానించింది. ఈ తీర్పుపై విశ్లేషణను స్వాగతిస్తామని తెలిపింది. ప్రజలు తనకు ఓటేస్తే.. జూన్ 2న తిరిగి జైలుకు వెళ్లాల్సిన అవసరం ఉండదని కేజ్రీవాల్ తన ప్రసంగాల్లో పేర్కొన్నారంటూ ఈడీ తరఫున వాదిస్తోన్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు వెల్లడించారు. ఆయన ఆ మాట ఎలా అంటారని అభ్యంతరం వ్యక్తంచేశారు. మరోవైపు, ఢిల్లీ సీఎంకు బెయిల్ రావడంపై కేంద్రంలోని ఒక సీనియర్ మంత్రి చేసిన వ్యాఖ్యలను ఆయన తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ ప్రస్తావించారు.


ఇరుపక్షాల వాదనలపై కోర్టు స్పందిస్తూ..''ఈ తీర్పుపై విమర్శలను స్వాగతిస్తున్నాం. ఆయన ఎప్పుడు లొంగిపోవాలో మా ఆదేశాల్లో స్పష్టంగా ఉంది. ఇది సర్వోన్నత న్యాయస్థానం ఆదేశం. చట్టపాలన దీని ఆధారంగానే ఉంటుంది. మేం ఎవరికీ మినహాయింపు ఇవ్వలేదు. అదంతా ఆయన ఊహే. దానిపై మేం మాట్లాడానికి ఏమీ లేదు'' అని స్పష్టంచేసింది.





## కూతురును కారులో మరిచిపోయిన పేరెంట్స్

వివరాలు 2లో



## కేవలం 12 సెకన్లలో రూ.200 కోట్లు కొట్టేశారు..!

వివరాలు 3లో

## అమిత్ షాను ప్రధాని చెయ్యడమే మోడీ లక్ష్యం

- యూపీ సీఎంగా యోగిని కూడా తొలగిస్తారు
- ఆప్ అధినేత కేజ్రీవాల్ కీలక వ్యాఖ్యలు



**ముందడుగు ఢిల్లీ:**

కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను ప్రధానిని చేసేందుకు మోడీ ఓట్లడుగుతున్నారని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. యూపీ సీఎంగా యోగి ఆదిత్యనాథ్‌ను కూడా మిగతా 2లో

## సీఏఏ చట్టాన్ని తొలగించడం అసాధ్యం

- ఎస్పీ, హస్తం పార్టీలవి అసత్య ప్రచారం
- యూపీ ప్రచారంలో మోడీ వ్యాఖ్యలు

**ముందడుగు ఉత్తరప్రదేశ్ :**

భారత్‌కు వచ్చిన శరణార్థులకు సీఏఏ ద్వారా పౌరసత్వం కల్పించే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. దేశ విభజన, ఇతర కారణాలతో దేశంలో చాలా ఏళ్లుగా శరణార్థులు ఇక్కడ మిగతా 2లో





## నెల అన్నం మానేస్తే ఏమవుతోంది..?

వివరాలు 4లో

ముందడుగు
శుక్రవారం, 17-5-2024, హైదరాబాద్

# అమిత్ షాను ప్రధాని చెయ్యడమే మోడీ లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

తొలగిస్తారని జోస్యం చెప్పారు. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్‌తో కలిసి నిర్వహించిన సంయుక్త ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. మనీలాండరింగ్ కేసులో విడుదలైన తర్వాత తొలిసారి కేజ్రీవాల్.. మోదీ రిటైర్మెంట్ గురించి ప్రస్తావించారు. దీన్ని అమిత్ షా ఖండించారు. అధికారంలోకి వస్తే మూడోసారీ మోదీనే ప్రధానిగా కొనసాగుతారని చెప్పారు. మరో మూడు విడత ఎన్నికలు మిగిలిన ఉన్న వేళ దీని గురించి మరోసారి కేజ్రీవాల్ మాట్లాడారు.

''యూపీ ప్రజలకు కొన్ని విషయాలు చెప్పాలనుకుంటున్నా. అమిత్ షాను ప్రధాన మంత్రిని చేసేందుకే మోదీ ఓట్లడుగుతున్నారు. వచ్చే ఏడాది సెప్టెంబర్ 17 నాటికి ఆయనకు 75 ఏళ్లు నిండుతాయి. మళ్లీ గెలిస్తే తన వారసుడిగా అమిత్ షాను మోదీ కూర్చోబెడతారు. ఎందుకంటే ఈ నిబంధన పెట్టిందే ఆయన. కాబట్టే దీని గురించి ఎక్కడా మోదీ మాట్లాడడం లేదు. అంతే కాదు.. ఒకవేళ మూడోసారి భాజపా అధికారంలోకి వస్తే రెండు మూడు నెలల్లో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను కూడా ఆ పదవి నుంచి తొలగిస్తారు. రాజ్యాంగాన్ని మార్చేసి ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను రద్దు చేస్తారు'' అని కేజ్రీవాల్ అన్నారు.

# కేరళలో కొత్త వైరస్.. ఇప్పటివరకు 12మంది మృతి

## నాలుగు జిల్లాలకు ఆరోగ్య శాఖ హెచ్చరికలు జారీ

**ముందడుగు కేరళ:**

హెపటైటిస్ ఎ వైరస్ కేరళ రాష్ట్రంలో విజృంభిస్తోంది. ఇప్పటి వరకూ ఈ వైరస్ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 12 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ప్రభుత్వం బుధవారం వెల్లడించింది. ఈ ఏడాది మొదటి నాలుగున్నర నెలల్లో రాష్ట్రంలో 1,977 హెపటైటిస్ ఎ కేసులు వెలుగు చూసినట్లు కేరళ ఆరోగ్య శాఖ తెలిపింది. కోజికోడ్, మలప్పురం, త్రిసూర్, ఎర్నాకులం జిల్లాల్లోనే అత్యధిక కేసులు బయట పడినట్లు తెలిపింది. ఈ క్రమంలో ఈ నాలుగు జిల్లాలకు రాష్ట్ర ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ హెచ్చరికలు జారీ చేశారు. ఈ జిల్లాల్లో వైరస్ కట్టడికి క్షేత్రస్థాయిలో పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారును ఆదేశించారు. వైరస్ ప్రభావిత ప్రాంతాల్లో నీటి వనరులను క్లోరినేషన్ చేసి, రెస్టారెంట్లకు హీట్ వాటర్ ను మాత్రమే సరఫరా చేయాలని ఆదేశించారు.



హెపటైటిస్ ఎ వైరస్ కాలేయాన్ని ప్రభావితం చేస్తుంది. కలుషితమైన ఆహారం, నీటి ద్వారా లేదా అంటువ్యాధి ఉన్న వ్యక్తితో ప్రత్యక్ష సంబంధం ద్వారా ఇది వ్యాపిస్తుంది. హెచ్ఐవీ, కాలేయ వ్యాధితో ఉన్నవారు త్వరగా హెపటైటిస్ బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అలసట, కడుపునొప్పి, జ్వరం, వికారం, వాంతులు, విరేచనాలు, ఆకలి లేకపోవడం, దురద, కామెర్లు (చర్మం, గోర్లు, కళ్లు, మూత్రం పసుపు రంగులో ఉండటం) ఈ వ్యాధి లక్షణాలు. కాచి చల్లార్చిన నీరు తాగడం, బహిరంగ మలవిసర్జనకు దూరంగా ఉండటం, తినేముందు చేతులు శుభ్రం చేసుకోవడం వంటి జాగ్రత్తలు పాటించడం ద్వారా హెపటైటిస్ ఏ బారిన పడకుండా ఉంటారు.

# సీఏఏ చట్టాన్ని తొలగించడం అసాధ్యం

మొదటిపేజీ తరువాయి

జీవిస్తున్నారు. ఆ బాధితులకు కేంద్రం సీఏఏ ద్వారా పౌరసత్వం కల్పిస్తోంది. ఎస్పీ, హస్తం పార్టీ ఈ చట్టంపై అసత్యాలు ప్రచారం చేస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌తో పాటు దేశవ్యాప్తంగా అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయి'' అని ప్రధాని దుయ్యబట్టారు. యూపీలోని అజంగఢ్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మోడీ ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు.

అధికారం సాధిస్తే సీఏఏను రద్దు చేసేందుకు ఇండియా కూటమి యోచిస్తోంది. కానీ, అది ఎన్నటికీ జరగదు. ఈ చట్టాన్ని తొలగించడం అసాధ్యం. వారంతా మోసగాళ్లు (ప్రతిపక్ష నేతలను ఉద్దేశిస్తూ). మతోన్మాద మంటల్లో దేశం కాలిపోయేలా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు అని మోడీ ప్రతిపక్షాలపై పరోక్షంగా తీవ్ర విమర్శలు గుప్పించారు. కాగా.. సీఏఏ చట్టం ప్రకారం.. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌ల నుంచి వలస వచ్చిన ముస్లిమేతర శరణార్థుల వద్ద తగిన పత్రాలు లేకపోయినా వారికి సత్వరమే భారత పౌరసత్వాన్ని ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం నిబంధనల్ని రూపొందించిన సంగతి తెలిసిందే. 2014 డిసెంబరు 31 కంటే ముందు ఈ మూడు దేశాల నుంచి భారత్‌కు వచ్చిన హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలకు ఇవి వర్తిస్తాయి.

# మహారాష్ట్రలో బయటపడ్డ నోట్ల కట్టల గుట్టలు

మొదటిపేజీ తరువాయి

చేసుకుంది. అందులో 8 కేజీల బంగారం, రూ.14 కోట్ల నగదు ఉందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. పన్ను ఎగవేతకు సంబంధించిన ఆరోపణలతో నాందేడ్‌లోని ఆర్థిక లావాదేవీలు జరిపే సంస్థలపై ఈ సోదాలు జరిగాయని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. పుణె, నాసిక్, నాగ్‌పూర్, పర్భని, ఛత్రపతి, శంబాజీనగర్, నాందేడ్‌కు చెందిన ఆదాయపన్ను విభాగం అధికారులు సంయుక్తంగా ఈ తనిఖీలు చేపట్టారు. 25 వాహనాల్లో వచ్చిన వారు మే 10 నుంచి మే 12 వరకు ఆయా సంస్థలకు చెందిన పలు కార్యాలయాలతో పాటు యాజమాన్యానికి చెందిన వ్యక్తిగత నివాసాల్లోనూ సోదాలు చేశారు. నాందేడ్‌లో ఈ స్థాయిలో రైడ్స్ జరగడం ఇదే తొలిసారి. ఈ క్రమంలో కోట్ల రూపాయిల సంపదను గుర్తించారు. దాంతో నిందితులపై అధికారులు తదుపరి చర్యలను ప్రారంభించారు. ఇదిలాఉంటే.. దొరికిన సొమ్మును లెక్కించడానికి 14 గంటల సమయం పట్టినట్లు సమాచారం. బస్తాల్లో ఉన్న డబ్బును బయటకు తీస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

# తెలంగాణలో రాగల 5 రోజులు వర్షాలు

**పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరిక**



**ముందడుగు తెలంగాణ:**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రాగల 5 రోజులపాటు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. గురువారం మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కి.మీల వేగంతో గాలులతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ ఐదు రోజుల పాటు ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ యెల్లో హెచ్చరికలను జారీ చేసింది. బుధవారం తూర్పు విదర్భ దాని పరిసర ప్రాంతాలలో కొనసాగిన ఆవర్తనం గురువారం మధ్యప్రదేశ్ నైరుతి ప్రాంతాలలో సగటు సముద్ర మట్టానికి 0.9 కిలో మీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై ఉన్నట్లు పేర్కొంది. రాష్ట్రంలోకి క్రింది స్థాయి గాలులు ప్రధానంగా ఆగ్నేయ దిశ నుంచి వీస్తున్నట్లు వెల్లడించింది.

### హైదరాబాద్‌లో పలు చోట్ల వర్షం


గచ్చిబౌలి, కూకట్‌పల్లి, నిజాంపేట్, హైదర్‌నగర్, బాచుపల్లి, బోయిన్‌పల్లి, మారేడుపల్లి, బేగంపేట్, ప్యారడైజ్, చిలకలగూడ, అల్వాల్, జవహర్‌నగర్, మల్కాజిగిరి, నేరేడ్‌మెట్, నాగారం, కుత్బుల్లాపూర్, చింతల్, షాపూర్‌నగర్, గాజులరామారం, సూరారం, బహదూర్‌పల్లి, షేక్‌పేట, రాయదుర్గం, పంజాగుట్ట, బోరబండ, రెహమత్‌నగర్, ఉప్పల్‌లో గురువారం భారీగా వర్షం పడింది.

# కూతురును కారులో మరిచిపోయిన పేరెంట్స్

## ఊపిరాడక మృతి చెందిన మూడేళ్ల చిన్నారి

**ముందడుగు రాజస్థాన్:**

ఇద్దరు కూతుర్లతో కలిసి భార్యాభర్తలు పెళ్లికి వెళ్లారు. అక్కడకు చేరుకున్న తర్వాత భార్య, పెద్ద కూతురు కారు నుంచి దిగారు. ఇద్దరు కుమార్తెలు కారు దిగి తల్లితో కలిసి ఫంక్షన్ హాల్‌లోకి వెళ్లి ఉంటారని భావించిన ప్రదీప్ కారును ఒక చోట పార్క్ చేసి డోర్ లాక్ చేశాడు. తర్వాత అతడు కూడా లోపలకు వెళ్లాడు. వారిద్దరూ విడివిడిగా



సుమారు రెండు గంటలపాటు పెళ్లికి హాజరైన వారిని కలిసి ముచ్చటించారు. మరోవైపు చివరకు కలుసుకున్న భార్యాభర్తలు మూడేళ్ల చిన్న కుమార్తె గోర్విక కనిపించకపోవడంతో ఆందోళన చెందారు. ఆ చిన్నారి గురించి అక్కడ వెతికారు. మూడు గంటల తర్వాత పార్క్ చేసిన కారు వద్దకు వెళ్లారు. డోర్ తెరిచి చూడగా వెనుక సీటులో అచేతనంగా పడి ఉన్న గోర్వికను చూశారు. వెంటనే ఆసుపత్రికి తరలించగా ఊపిరాడక ఆ చిన్నారి అప్పటికే చనిపోయినట్లు డాక్టర్లు చెప్పారు. అయితే కుమార్తె మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించేందుకు పేరెంట్స్ నిరాకరించినట్లు పోలీసులు తెలిపారు. అలాగే ఈ సంఘటనపై ఫిర్యాదు కూడా చేయలేదని వెల్లడించారు. ఈ దారుణ సంఘటన రాజస్థాన్‌లోని కోటాలో జరిగింది.

ముందడుగు
శుక్రవారం, 17-5-2024, హైదరాబాద్

# చేతి వేళ్లకు చేయాల్సిన ఆపరేషన్ నాలుకకు చేసారు

**ముందడుగు కేరళ:**



డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా నాలుగేళ్ల ఓ బాలికకు లేనిపోని అనారోగ్యం తెచ్చింది. చేతి వేళ్లకు చేయాల్సిన ఆపరేషన్‌ను పొరపాటున నాలుకకు చేయడం ప్రస్తుతం తీవ్ర దుమారానికి కారణం అయింది. కేరళ కోజికోడ్‌లోని కోజికోడ్ మెడికల్ కాలేజ్ హాస్పిటల్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది. సాధారణంగా అందరి చేతులకు వేళ్లు 5 ఉంటాయి. కానీ నాలుగేళ్ల చిన్నారి చేతికి మాత్రం 6 వేళ్లు ఉన్నాయి. అయితే అదనంగా వచ్చిన ఆ వేలును సర్జరీ చేసి తొలగించాలని ఆమె కుటుంబ సభ్యులు కోజికోడ్ మెడికల్ కాలేజ్ హాస్పిటల్‌కు వచ్చారు. అయితే ఆ చిన్నారిని ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లిన వైద్య సిబ్బంది కొంత సేపటి తర్వాత బయటికి తీసుకువచ్చారు. అయితే ఆపరేషన్ థియేటర్ నుంచి బయటికి వచ్చిన ఆ చిన్నారి నోటి చుట్టూ ప్లాస్టర్ ఉండడాన్ని కుటుంబ సభ్యులు గమనించారు. అయితే ఆ బాలిక నోటికి ప్లాస్టర్ ఎందుకు వేశారో ఆమె కుటుంబ సభ్యులకు అర్థం కాలేదు. ఆ చిన్నారి చేతిని చూడగా.. ఆమెకు ఉన్న ఆరో వేలు అలాగే ఉంది. దీంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు.. నర్సుకు విషయం చెప్పి ఏం జరిగిందని ప్రశ్నించారు. ఆ సమయంలో ఆ నర్సు నవ్వుతూ ఉందని వారు తెలిపారు. అంతేకాకుండా ఆ చిన్నారి నాలుకకు కూడా సమస్య ఉందని ఆమె చెప్పినట్లు వెల్లడించారు. ఈ ఘటన గురించి సదరు డాక్టర్‌కు ఫిర్యాదు చేయగా.. ఆయన వచ్చి జరిగిన తప్పుకు క్షమాపణలు చెప్పి.. ఆ చిన్నారి ఆరో వేలు తొలగించేందుకు తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ సంఘటన గురించి చిన్నారి తల్లిదండ్రులు ఉన్నతాధికారులకు సమాచారం అందించగా.. సీరియస్‌గా తీసుకుని దీనిపై దర్యాప్తు ప్రారంభించారు.

# కేవలం 12 సెకన్లలో రూ.200 కోట్లు కొట్టేశారు..!

- హైటెక్ మోసానికి పాల్పడ్డ అన్నదమ్ములు
- ఇద్దరికి 20 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశం

**ముందడుగు అమెరికా:**




అత్యంత ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయంలో చదువుతున్న ఇద్దరు అన్నదమ్ములు తమ చదువు, నైపుణ్యాలను దుర్వినియోగం చేసి హైటెక్ మోసానికి పాల్పడ్డారు. కేవలం 12 సెకన్లలో 25 మిలియన్ డాలర్ల క్రిప్టోకరెన్సీలను దొంగిలించారు. ఎట్టకేలకు వారి మోసం బయటపడి ఏడాది తర్వాత పోలీసులకు చిక్కారు. అమెరికాకు చెందిన ఆంటోన్ బ్యూనో, జేమ్స్ బ్యూనో మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్నారు. అధునాతన సాంకేతికతలో నైపుణ్యం ఉన్న వీరు ఈజీ మనీ కోసం మోసానికి పాల్పడ్డారు. గతేడాది ఏప్రిల్‌లో క్రిప్టో టెక్నాలజీలో పెండింగ్ లావాదేవీలను మోసపూరితంగా యాక్సెస్ చేసి వాటిని మార్చారు. కేవలం 12 సెకన్లలోనే 25 మిలియన్ డాలర్ల విలువైన ఇథేరియం క్రిప్టోలను వారు తమ ఖాతాల్లోకి బదిలీ చేసుకున్నారు. ట్రేడర్లు తమ ఖాతాల్లోకి క్రిప్టో లావాదేవీలు జమచేస్తున్నా కాకపోవడంతో వెంటనే అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ ఘరానా మోసం బయటపడింది. దర్యాప్తు చేపట్టిన ఫెడరల్ ప్రాసిక్యూటర్లు నిందితులను గుర్తించి తాజాగా పట్టుకున్నారు. బోస్టన్‌లో ఆంటోన్‌ను, న్యూయార్క్‌లో జేమ్స్‌ను అరెస్టు చేశారు. నిందితులు ఐదు నెలల పాటు ఇందుకు ప్లాన్ చేసి సెకన్లలో అమలుచేశారని ప్రాసిక్యూటర్లు తెలిపారు. విచారణలో నేరాన్ని అంగీకరించిన ఈ అన్నదమ్ములు.. ఆ క్రిప్టోలను తిరిగిచ్చేందుకు నిరాకరించినట్లు తెలుస్తోంది. వాటిని ఎక్కడ దాచిపెట్టారన్న విషయాన్ని కూడా వెల్లడించట్లేదట. ఈ కేసులో నేరం రుజువైతే వీరిద్దరికీ 20 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంది.

# ఈసారి ముందుగానే రుతుపవనాలు

- జూన్ 6 తర్వాత తెలంగాణను తాకే అవకాశం
- భారత వాతావరణ శాఖ శుభవార్త

**ముందడుగు జాతీయం:**



ఈసారి ముందుగానే రుతుపవనాలు వస్తాయని అంచనా వేసింది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం జూన్ 6 తర్వాత రుతుపవనాలు తెలంగాణను తాకే అవకాశం ఉందని పేర్కొంది. భారత వాతావరణ శాఖ శుభవార్త చెప్పింది. రుతుపవనాలు మే 19న దక్షిణ అండమాన్ సముద్రంలోకి ప్రవేశించే అవకాశం ఉందని వివరించింది. కేరళను రుతుపవనాలు మే 31 న తాకే అవకాశం ఉంది. "నైరుతి రుతుపవనాలు సాధారణంగా జూన్ 1న కేరళ తీరాన్ని తాకుతాయి. అయితే ఈ ఏడాది మే 31న నైరుతి రుతుపవనాలు కేరళలో ప్రవేశించే అవకాశం ఉంది" అని ఐఎండీ ఒక ప్రకటనలో తెలిపింది. జూన్ 6 తర్వాత తెలంగాణలో వర్షాలు పడే అవకాశం ఉందని అంచనా వేసింది.

అప్పుడే భారీ ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం లభిస్తుందని పేర్కొంది. ఇక హైదరాబాద్ విషయానికొస్తే ఇక్కడ కూడా జూన్‌లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్‌లో సాధారణ వర్షపాతం 615.4 మిమీ కాగా గత ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో 769.5 మిల్లీమీటర్ల సంచిత వర్షపాతం నమోదైంది. నగరం మొత్తం మీద 'అదనపు' వర్షపాతం నమోదైతే, కొన్ని ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

# హైదరాబాద్ నగరంలో అకాల వర్షం

పలు చోట్లలో రోడ్లపై వర్షపు నీరు ▪ భారీగా ట్రాఫిక్ జామ్.. నిలిచిపోయిన వాహనాలు

**ముందడుగు హైదరాబాద్:**



మండే ఎండలతో సతమతమవుతున్న హైదరాబాద్లో అకాల వర్షం దంచికొట్టింది. మధ్యాహ్నం వరకు ఎండలు మండగా.. సాయంత్రానికి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. హైదరాబాద్‌తో సహా పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో కుండపోతగా కురిసింది. ఉరుములు, మెరుపులతో పాటు భారీ స్థాయిలో ఈదురుగాలులతో వర్షం కురిసింది. దీంతో.. నగరం మొత్తం తడిసిముద్దయింది. రోడ్లన్ని వర్షపు నీటితో నిండిపోయాయి. పలు చోట్లలో రోడ్లపై పెద్ద ఎత్తున వర్షపు నీరు నిలవటంతో.. భారీగా ట్రాఫిక్ జామైంది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో జీహెచ్ఎంసీ సిబ్బంది, DRF బృందాలు అప్రమత్తమయ్యాయి. వర్షం వల్ల సమస్యలు తలెత్తితే, సహాయం కోసం డీఆర్ఎఫ్ నెంబర్లు 04021111111, 9000113667 సంప్రదించాలని అధికారులు సూచించారు. మరోవైపు వర్షం కారణంగా ఉప్పల్ మైదానంలో జరుగబోయే మ్యాచ్ ఆలస్యమైంది. ఇదిలా ఉండగా.. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, కూకట్‌పల్లి, నిజాంపేట, జీడిమెట్ల, సికింద్రాబాద్, మలక్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఐకియా, మాదాపూర్ ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది.

ముందడుగు
శుక్రవారం, 17-5-2024, హైదరాబాద్

# గెలిస్తే మేము చెప్పిందే కరెక్ట్

## ఎన్నికల ఫలితాల్లో జ్యోతిష్యుల జ్యోస్యాలు

**ముందడుగు ప్రత్యేకం:**

జ్యోతిష్యాలను ఎంత వరకు నమ్మాలో, ఎంతవరకు నమ్మరాదో మాత్రం తెలియదు. మనిషి గ్రహస్థితిని బట్టి బాగా నమ్మేవాళ్లు లేకపోలేదు. అలాంటిది ఇప్పుడు జ్యోతిష్యాలు రాజకీయంలో అడుగుపెట్టాయి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కచ్చితంగా మూడోసారి ఎన్నికల్లో విజయం సాధిస్తారని, ముఖ్యమంత్రి పదవిని కేటీఆర్ కు కట్టబెడతారని, కేసీఆర్ కేంద్ర రాజకీయాల్లో చక్రం తిప్పుతారని చాలామంది జ్యోతిష్యులు యథేచ్ఛగా జోస్యాలు చెప్పారు. భారత రాష్ట్ర సమితికి చెందిన నాయకులు, కార్యకర్తలు అందరూ నిజమే కాబోలు అనుకున్నారు. పేరున్న జ్యోతిష్యులంతా మళ్లీ తామే అధికారంలోకి రాబోతున్నామని చెబుతున్నారు. ప్రజలు కూడా తమను కాకుండా ఇంకెవరికి ఓటు వేస్తారులే అనే ధీమాను కూడా బీఆర్ఎస్ శ్రేణులు వ్యక్తపరిచాయి. కానీ కేసీఆర్ మాత్రం గెలవలేదు, అసెంబ్లీలోకి రాలేదు.



ఎన్నికల ఫలితాలలో అతి తక్కువగా అంచనా వేసిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగా, అంతకంటే తక్కువ అంచనా వేసిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఈ సంఘటనను కేసీఆర్ ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నారు. ఇంతవరకు అసెంబ్లీలోకి అడుగుపెట్టలేదు. రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిగా సభలో చూడాల్సి ఉంటుంది కాబట్టే కావాలనే రావడంలేదంటూ కాంగ్రెస్ శ్రేణులు విమర్శిస్తున్నాయి.

ఇప్పుడు మళ్లీ ఆంధ్రా ఎన్నికల ఫలితాలపై మరికొందరు జ్యోతిష్యులు అప్పుడే ఫలితాలు చెబుతున్నారు. జాతక చక్రాలు పరిశీలించామని, ఎంతో క్షుణ్ణంగా పరిస్థితులను అవగాహన చేసుకున్నామని, గ్రహాల స్థితిగతులు, వాటి బలాబలాలు అన్నింటినీ తెలుసుకొన్న తర్వాత వైఎస్ జగన్ రెండోసారి అధికారంలోకి రాబోతున్నారని వీరంతా చెబుతున్నారు. మరికొందరు కూటమి అధికారంలోకి వస్తుందని అంటున్నారు. ఇక్కడ ఎవరిదీ నమ్మాలో, ఎవరిదీ నమ్మకూడదో అర్థమే కావడం లేదు. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అయ్యాడు కాబట్టి.. వైఎస్ జగన్ కూడా రెండోసారి ముఖ్యమంత్రి అవుతారంటూ తెలుగుదేశం పార్టీ శ్రేణులు సెటైర్లు పేలుస్తున్నాయి.

# నెల అన్నం మానేస్తే ఏమవుతోంది..?

- శరీరంలో జరిగే మార్పులు ఇవేనా
- బరువుతో పాటు ఇన్ని ప్రయోజనాలా

**ముందడుగు ప్రత్యేకం:**

సమయం, సందర్భం లేకుండా మనిషి ఏది పడితే అది తింటే అనారోగ్య సమస్యలే కాకుండా బరువు పెరుగుతారు. అందుకే ప్రతి మనిషికి ఆహార నియంత్రణ చాలా అవసరం. బరువు తగ్గాలనుకునే వారు నెల రోజులు అన్నాన్ని వదిలేస్తే.. మరికొద్ది రోజుల్లో తేడా మీకే తెలుస్తుంది. బియ్యం వేగంగా కేలరీలను పెంచుతుంది.. జీవక్రియను నెమ్మదిస్తుంది. ఇది పొట్ట కొవ్వు, ఊబకాయాన్ని పెంచుతుంది. మీరు బరువు తగ్గాలనుకుంటే ఒక నెలపాటు అన్నం మానేయండి.

### చక్కెర స్థాయి నియంత్రణ

మనం ఎక్కువ కార్బోహైడ్రేట్లను తీసుకున్నప్పుడు వాటిని జీర్ణం చేయడానికి మనకు ఎక్కువ చక్కెర అవసరం. అప్పుడు మన శరీరంలో చక్కెర స్థాయి పెరుగుతుంది. శరీరంలో షుగర్ లెవెల్ పెరిగితే మధుమేహం సమస్య తీవ్రమవుతుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు సమస్య పెరుగుతుంది. అలాగే థైరాయిడ్, పీసీఓడీ బాధితులకు కూడా ఇది మంచిది కాదు. ఏదైనా వ్యాధితో బాధపడేవారు శరీరంలో చక్కెర స్థాయిని నియంత్రించడానికి అన్నం తక్కువగా తినాలి. షుగర్ లెవల్స్ అదుపులో ఉంచుకోవాలి.

### మెదడు మరింత చురుకుగా

అన్నం తినడం వల్ల బద్ధకం పెరుగుతుంది. తరచుగా నిద్ర వస్తుంది. దీనివల్ల పనిపై ఆసక్తి ఉండదు. కానీ, అన్నం తినడం మానేస్తే శరీరం మునుపటి కంటే చురుగ్గా మారుతుంది. సోమరితనం తగ్గుతుంది. కూర్చున్న, నిలబడినా నిద్ర మత్తు ఉండదు. మీరు ఇంతకు ముందెన్నడూ అనుభవించని అనేక మార్పులను మీరు గమనిస్తారు. శరీరం బరువు తగ్గినట్లు అనిపిస్తుంది. దీంతో మీ మెదడు మరింత చురుకుగా ఉండటం వల్ల మీరు వేగంగా పని చేస్తారు.



### రైస్ ఫుడ్ మితంగా బెటర్

బియ్యంలో లభించే కార్బోహైడ్రేట్లు మన శరీరానికి శక్తినివ్వడానికి అవసరం. దాన్ని పక్కన పెడితే మనల్ని బలహీనపరుస్తుంది. దీనివల్ల కండరాలు బలహీనపడతాయి. శరీరంలో పోషకాలు, ఖనిజాల లోపం సంభవించవచ్చు. శరీరంలోని కొవ్వును తగ్గించడమే లక్ష్యం కావాలి. కండరాలను బలహీనపరచవద్దు. కాబట్టి రైస్ ఫుడ్ ను ఎప్పటికప్పుడు మితంగా తీసుకుంటూ, పూర్తిగా దూరంగా ఉండకూడదని నిపుణులు సూచిస్తున్నారు. మధుమేహం అదుపులో ఉండాలంటే, బరువు తగ్గాలంటే నెల రోజుల పాటు అన్నం పూర్తిగా మానేయాలని నిర్బంధం లేదు. రోజూ కొద్ది మొత్తంలో తీసుకోవచ్చు. ఇది మితంగా ఉండాలి. మనం బియ్యం ఆహారాన్ని నివారించినట్లయితే, మన రోజువారీ ఆహార జాబితాలో పోషకమైన ఆహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలి.

# మూడు సెషన్లలో లాసెట్ పరీక్ష

## అప్లికేషన్లు భారీగా రావడమే కారణం

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

టీఎస్ లాసెట్ , పీజీ ఎల్ సెట్ లకు విద్యార్థులు అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నందున మూడు సెషన్లలో ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నట్టు టీఎస్ లాసెట్ , పీజీ ఎల్ సెట్ 2024 కన్వీనర్ ప్రో . బి .విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు . ఇదివరకు నిర్దేశించిన ప్రకారం జూన్ 6 వ తేదీన రెండు సెషన్ లో నిర్వహించనున్న ఈ పరీక్షను ఇప్పుడు మూడు సెషన్ లలో నిర్వహించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు . టీఎస్ లాసెట్ ( 3 ఏళ్ళ డిగ్రీ కోర్స్ ) పరీక్షను సెషన్ 1 లో ఉదయం 9 నుండి 10 .30 నిమిషాల వరకు ,అలాగే సెషన్ 2 లోమధ్యాహ్నం 12 .30 నుండి 2 .00 గంటలవరకు నిర్వహించనున్నారు .ఇక ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ డిగ్రీ కోర్స్ , టీఎస్ పీజీ ఎల్ సెట్ (ఎల్ఎల్ .ఎం ) కోర్స్ ప్రవేశ పరీక్ష సాయంత్రం 4 .00 నుండి 5 .30 నిమిషాలవరకు ఉంటుందని తెలిపారు . రిజిస్ట్రేషన్ దరఖాస్తులు సమర్పించేందుకు గాను రూ . .2000 అపరాధ రుసుముతో ఈ నెల 20 వతేది చివరి తేదీ అని పేర్కొన్నారు . ఇదివరకు దరఖాస్తులు సమర్పించిన అభ్యర్థులు ఈ నెల 20 నుండి 25 వతేదీలోగా తమ దరఖాస్తులను ఎడిట్ చేసుకోవచ్చని తెలిపారు . మిగతా వివరాలకు https ://lawcet.tsche . ac .in ను సంప్రదించాలని సూచించారు